


ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 27.0



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖచిత్రం

- పరిపాలనా సౌలభ్యం కోసం ఇబ్బడిముబ్బడిగా జిల్లాలు, మండలాల ఏర్పాటు
- కొత్త మండలాల్లో కొరవడిన సౌకర్యాలు.. పరిపాలన అంతంతే..
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం రెండు జిల్లాల్లో
- నిధులు, పనులకు ఇబ్బందులు
- వనపర్తి జిల్లాలో పూర్తి స్థాయిలో ఒక నియోజకవర్గం.. పాక్షికంగా మూడు
- హేతుబద్ధీకరణ చేస్తే నియోజకవర్గాల పునర్విభజన సులభమయ్యే అవకాశం


తెరపైకి.. హేతుబద్ధీకరణ

మహబూబ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 2016లో కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత కూడా ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లను నెరవేర్చడానికి ఇబ్బడిముబ్బడిగా మండలాలను ఏర్పాటు చేసుకుంటూ పోయింది. కొన్ని జిల్లాలు ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మరికొన్ని జిల్లాలు తక్కువ మండలాలతో పెద్ద పరిపాలన వ్యవస్థను నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాల ఏర్పాటు సమయంలో ఉమ్మడి పాలమూరును నాలుగు జిల్లాలుగా విభజించిన ప్రభుత్వం.. ఆ తర్వాత నారాయణపేటను కూడా జిల్లాగా ప్రకటించి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విడదీసింది. అప్పటి నుంచి జిల్లాల విభజన శాస్త్రీయంగా జరుగలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించుకుంటూ వస్తోంది. పార్లమెంట్ లేదా జనాభా ప్రాతిపదికన జిల్లాల విభజన చేస్తే సౌలభ్యంగా ఉంటుందని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడింది. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక సందర్భంలో జిల్లాల ఏర్పాటును పునఃపరిశీలించి.. హేతుబద్ధీకరణ చేయడానికి జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత కూడా మీడియాతో ఇష్టాగోష్ఠిలో.. సీఎం మండలాలు, రెవెన్యూ డివిజన్లను హేతుబద్ధీకరణ చేసిన తర్వాతనే జిల్లాల విభజన విషయంలో పునఃసమీక్ష చేపడతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో హేతబద్ధీకరణ ఎలా ఉంటుందనే విషయంలో చర్చ జరుగుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కొంత పరిపాలన సౌలభ్యం ఏర్పడినప్పటికీ.. శాస్త్రీయంగా విభజన జరగకపోవడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఆ హేతుబద్ధీకరణ ఎలా ఉండబోతోంది? ఎప్పటి నుంచి ప్రక్రియ ప్రారంభిస్తారనే విషయంలో మాత్రం ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికీ ఇంకా కొన్ని మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం డిమాండ్లు ఉండగా.. వాటిని ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

ఒక్కో నియోజకవర్గం రెండు జిల్లాల్లో..

జిల్లాల ఏర్పాటు సమయంలో శాస్త్రీయత పాటించలేదనడానికి ఒక్కో నియోజకవర్గం రెండేసి జిల్లాల పరిధిలో ఉండటాన్ని పలువురు కారణంగా చూపిస్తున్నారు. ఉదాహరణకు వనపర్తిని జిల్లాగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఆ జిల్లాకు పూర్తి స్థాయిలో ఒక నియోజకవర్గాన్ని, పాక్షికంగా మూడు నియోజకవర్గాలను కేటాయించింది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పానగల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలు వనపర్తి జిల్లాలో ఉండగా, పెంట్లవెల్లి, కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నాయి. దాంతో ఒకే నియోజకవర్గం ప్రజలు రెండు జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల నిధుల విడుదల విషయంలో, మండలాల వారీగా అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారింది. కొల్లాపూర్ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రెండు జిల్లాల అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఏర్పడుతోంది. అలాగే మక్తల్, దేవరకద్ర నియోజకవర్గాల పరిస్థితి కూడా అలాగే ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలు పరిగి నియోజకవర్గం పరిధిలోకి వస్తుండగా.. ఆ ఎమ్మెల్యే రెండు జిల్లాల పరిధిలో పనిచేయాల్సి వస్తోంది. కోయిల్‌కొండ మండలం నారాయణపేట నియోజకవర్గం కాగా.. ఆ మండలం మాత్రం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉంది. ఊర్కొండ మండలం జడ్చర్ల నియోజకవర్గం కాగా.. ఆ ఒక్క మండలం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా అధికారులను సంప్రదించాల్సి వస్తోంది. ఇలా చాలా మండలాల్లో ఇబ్బందులు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రాలు ఒకచోట.. మండలాలు మరోచోట ఉండటం ఇబ్బందికరంగా మారింది. అలాగే రెవెన్యూ డివిజన్లు కూడా శాస్త్రీయంగా లేవనే అభిప్రాయం ఉంది. ఉదాహరణకు గద్వాల, వనపర్తి జిల్లాలకు ఒకే ఒక రెవెన్యూ డివిజన్ ఉంది. రెవెన్యూ డివిజన్ అధికారుల పరిపాలన పరిధి, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ల పరిపాలన పరిధి సమానంగా ఉంది. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ఆవశ్యకత ఉంది. ఇవి కాకుండా ఇంకా కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ల ప్రతిపాదనలు ఉన్నాయి. ఎక్కువ గ్రామాలు ఉన్న మండలాలను విభజించకుండా.. తక్కువ గ్రామాలు ఉన్న మండలాలను విభించడం అశాస్త్రీయంగా ఉందనే అభిప్రాయం ఉంది. రానున్న ఎన్నికల సమయానికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందనే అంచనాలు ఉన్నాయి. ఆలోపు మండలాలు, రెవెన్యూ డివిజన్ల హేతబద్ధీకరణ పూర్తయితే.. కొత్త నియోజకవర్గాల ఏర్పాటు సులభతరం కానుంది.

కొత్త మండలాల్లో పరిపాలన ఏదీ?



జిల్లాల విభజన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాలు

ఉమ్మడి పాలమూరు జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ సమయంలో కొన్ని కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను ప్రకటించింది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రాజాపూర్, మూసాపేట, మహబూబ్‌నగర్ అర్బన్, మహ్మదాబాద్ మండలాలను ఏర్పాటు చేయగా.. ఆ తర్వాత దేవరకద్ర మండలంలోని కౌకుంట్లను మండలంగా చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో పదర, చారగొండ, ఊర్కొండ, పెంట్లవెల్లి, మున్ననూర్‌ను, వనపర్తి జిల్లాలో అమరచింత, మదనాపూర్, రేవల్లి, చిన్నంబావి, శ్రీరంగాపూర్ మండలాలను ఏర్పాటు చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏదులను మండలంగా ప్రకటించింది. అలాగే గద్వాల జిల్లాలో రాజోలి, ఉండవెల్లి మండలాలను ఏర్పాటు చేయగా.. ఇటీవల ఎర్రవల్లి మండలాన్ని ఏర్పాటు చేసింది. నారాయణపేట జిల్లాలో కృష్ణ మండలాన్ని ఏర్పాటు చేయగా.. ఆ తర్వాత గుండుమాల్, కొత్తపల్లి మండలాలను ప్రకటించింది. జిల్లాల విభజన సమయంలో ఏర్పాటు చేసిన మండలాల్లోనే సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మండలాల్లో ప్రైమరీ హెల్త్ సెంటర్లు లేకపోగా.. ఇంకొన్ని మండలాల్లో పోలీస్ స్టేషన్లకు, మండల కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తర్వాత ప్రకటించిన మండలాల్లో ఎర్రవల్లి, కౌకుంట్ల, ఏదుల, గుండుమాల్, కొత్తపల్లి వంటి మండలాల్లో ఇప్పటివరకు పూర్తి స్థాయి విభజన జరుగలేదు. కొన్ని మండలాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా.. కొన్నింటిలో జరుగడం లేదు. అధికారుల విభజన కాకపోవడం, రెవెన్యూ విభాగానికి సంబంధించి కొన్ని మండలాల్లో ఇన్‌చార్జి అధికారిని వారానికి రెండు రోజులు డిప్యూట్ చేస్తుండటం ఇబ్బందిగా మారింది. ఏదుల మండలం ఏర్పాటు సమయంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు నుంచి కొన్ని గ్రామాలను కలిపారు. అవి పూర్తిస్థాయి పరిపాలనలోకి రాలేదు. అక్కడా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సమస్యల నేపథ్యంలో కొత్త మండలాల్లో పరిపాలన మృగ్యం కాగా.. హేతబద్ధీకరణ సవాల్‌గా మారనుంది.



సంగమేశ్వర ఆలయంపై పరుచుకున్న ఇంద్రధనస్సు

వెల్లివిరిసిన ఇంద్రధనస్సు

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద శుక్రవారం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. కృష్ణానది అవతలి ఒడ్డున వెలసిన పురాతన సంగమేశ్వర ఆలయ సమీపంలో ఈ దృశ్యాన్ని చూసిన పలువురు ఆనందం వ్యక్తం చేశారు. సూర్యుని కిరణాలు నదిలోని నీటిని తాకి.. ఆలయంపై పడటంతో వెలుగులీనింది. అచ్చంపేటలోనూ ఇంద్రధనస్సు కనిపించింది.

- కొల్లాపూర్/అచ్చంపేట



కృష్ణానది నీటిలో సూర్యుని ప్రతిబింబం



అచ్చంపేట పట్టణంలో ఇంద్రధనస్సు

క్రెడిట్ కార్డు పేరుతో రూ.99 వేలు టోకరా

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘటన

గద్వాల క్రైం, మే 17: మీరు క్రెడిట్ కార్డుకు అర్హులయ్యారని, మీరు ఒప్పుకుంటే కార్డు మంజూరు అవుతుందని చెప్పడంతో సరే అన్న పాపానికి రూ. 99,277 పోగొట్టుకున్న సంఘటన గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితుడు నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని సుంకులమ్మమెట్టుకు చెందిన నరేష్ పాల వ్యాపారం చేస్తుంటాడు. గత నెల నాల్గో తేదీన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓ వ్యక్తి నరేష్‌కు ఫోన్ చేశాడు. మీరు క్రెడిట్ కార్డుకు అర్హులయ్యారని చెప్పడంతో కార్డు మంజూరు చేసేందుకు నరేష్ అంగీకరించాడు. మళ్లీ ఏప్రిల్ తొమ్మిదిన ఫోన్ చేసి కార్డు వచ్చింది కదా మీ కార్డు నెంబర్ చెప్పండని అడిగారు. కార్డు నెంబర్ చెప్పాక, ఓటీపీ అడిగారు. దాంతో ఓటీపీ కూడా చెప్పాడు. గురువారం(మే 16)న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు ఫోన్ చేసి, మీ క్రెడిడ్ కార్డు నుంచి రూ.99,277 వాడుకున్నారని అది చెల్లించాలని కోరారు. దాంతో కంగారు పడిన నరేశ్ తాను ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయలేదని శుక్రవారం బ్యాంక్ అధికారులను ఆశ్రయించారు. మీరు డబ్బులు ఖర్చు చేసినట్లు ఉందని, తప్పక చెల్లించాలని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దాంతో నరేష్ క్రెడిట్ కార్డు ఎక్కడ వాడినట్లు వివరాలు తెలుపాలని బ్యాంక్ సిబ్బందిని కోరగా కనిపించడం లేదని, కానీ ఖర్చు చేసినట్లు మాత్రం ఉందని చెప్పారు. దాంతో ఆన్‌లైన్‌లో తన డబ్బులను ఎవరో దొంగలించారని భావించి, సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేశానని తెలిపాడు.

అకాల వర్షం



వాగు ద్వారా చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు వెళ్తున్న నీరు



కొల్లాపూర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

- నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వాన
- గట్టులో 10, అయిజలో 9.2 సెంటీ మీటర్ల వర్షపాతం
- కొల్లాపూర్, చిన్నంబావిలలో తడిసిన ధాన్యం
- చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు చేరిన నీళ్లు
- చల్లబడిన వాతావరణం

మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ కొల్లాపూర్/నారాయణపేట/చిన్నంబావి/గట్టు/గద్వాల, :మే 17: మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో గురువారం అర్ధరాత్రి భారీ వర్షపాతం నమోదైంది. పార్లమెంట్ ఎన్నికల రోజు నుంచి వాతావరణం చల్లబడగా.. ప్రతీ రోజూ ఏదో ఒకచోట వర్షాలు కురుస్తున్నాయి. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలంలో అత్యధికంగా 10.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో వాగుల ద్వారా నీరు.. ఇటీవల నిర్మించిన చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు చేరుకుంటోంది. అలాగే ఇదే జిల్లా పరిధిలోని అయిజ మండలంలో 9.2 సెంటీమీటర్లు, కేటీదొడ్డిలో 7.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పలుచోట్ల కల్లాల్లో ఉన్న ధాన్యం తడవడంతో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండలంలో 6.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మొన్నటివరకు 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు పడిపోయాయి. నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో కూడా 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాల్లో ఏడు సెంటమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వాన పడింది. దాంతో రోడ్ల వెంట, కాలనీల్లో నీళ్లు పారాయి. కొల్లాపూర్ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం తడిసింది. మండుటెండలకు వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం



పెద్దదగడ కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

చెరువులు, కుంటలకు నీరు

జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు, ధరూరులో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురిసింది. గట్టు మండలంలో 95.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో చెరువులు, కుంటలకు నీరు చేరింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాల్లో నీరు చేరింది. వానాకాలం పంటల సాగు కోసం పొలాలు చదును చేసుకోడానికి ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు వాగుల ద్వారా భారీగా నీరు చేరుతోంది. రిజర్వాయర్ మధ్యలో ఉన్న గండిని ఇటీవల పూడ్చేశారు. దాంతో నీరు బయటికి వెళ్లే అవకాశం లేక గ్రామ సమీపానికి చేరుతుండటంతో ముంపు గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములు రాత్రి వేళ గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. గ్రామం చుట్టూ ఉన్న రెండు పెద్ద వాగుల ద్వారా నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. వర్షాకాలంలో గ్రామం ముంపునకు గురవక తప్పదని గ్రామస్థులు అంటున్నారు. ఈ రిజర్వాయర్‌ను రద్దు చేయాలని గ్రామస్థులు సంవత్సరానికి పైగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పునరావస కేంద్రంలో సదుపాయాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మించుకోడానికి గ్రామస్థులు ఆసక్తి చూపడం లేదు.

నారాయణపేటలో మోస్తరు వర్షం

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. నారాయణపేట పాత బస్టాండ్ రోడ్డులో చిన్నపిల్లల ఆస్పత్రి ముందు వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యధికంగా మాగనూరు మండలంలో 61.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా కోస్గి మండలంలో ఒక మిల్లీ మీటరు వర్షం పడింది. దామరగిద్ద మండలంలో 8.2, నారాయణపేటలో 16.8, ఊట్కూర్‌లో 33.2, కృష్ణలో 48, మక్తల్‌లో 28.2, నర్వ మండలంలో 38.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మరికల్‌లో 15.6, ధన్వాడలో 14.8, మద్దూర్‌లో 1.6 వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 24.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

లోతట్టు ప్రాంతంలోకి నీరు

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో భారీ వర్షం పడింది. దాంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యం కొనాలని రైతులు కోరుతున్నారు.



కొల్లాపూర్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



గట్టు మండలం చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లోకి చేరిన వర్షపు నీరు



నారాయణపేటలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు భారీగా చేరుతున్న నీరు
- ఇప్పటి వరకు 2,561 క్యూసెక్కుల రాక

అమరచింత, మే 17: ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్, సమాంతర కాలువల వద్దకు శుక్రవారం భారీగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేయించిన విషయం తెలిసిందే. దీంతో పూర్తిగా ఒట్టిపోయిన గుంతలు నిండుతూ ప్రాజెక్టుకు నీరు చేరింది. జూరాలలో ప్రస్తుతం 3.117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ కన్నా రెట్టింపు అంటే 2,561 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరింది. కర్ణాటక ప్రభుత్వం వదిలిన నీరు మరికొన్ని గంటలపాటు వచ్చే అవకాశం ఉంది. ఈ నీటి రాకతో తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. జూరాల ఎన్‌టీఆర్ ఎడమ కాలువ లేదా అనుసంధాన కాల్వ ద్వారా తాగునీటి అవసరాల కోసం అధికారులు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారి బీచుపల్లి ఆంజనేయులు తెలిపారు.



జూరాల ప్రధాన ఎడమ కాల్వ వైపు వస్తున్న నీరు

ఆటోను తప్పించబోయి..

రోడ్డు కిందకు దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

అలంపూర్ చౌరస్తా, మే 17: ఆటోను తప్పించబోయి ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన గద్వాల జిల్లా ఉండవల్లి స్టేజీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు పాండిచ్చేరి నుంచి 36మంది ప్రయాణికులతో హైదరాబాదుకు వెళ్తుండగా ఉండవల్లి స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న ఓ ఆటోను తప్పించబోయి రోడ్డుకు ఎడమ వైపు రహదారి కిందకు దూసుకెళ్లింది. ప్రమాద నివారణ కోసం ఏర్పాటు చేసిన క్రాష్ బ్యారియార్ ఢీకొంటూ కిందికి వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. సంఘట స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ ఘటనపై ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



రహదారి కిందకు దూసుకెళ్లిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

అన్నదాతలో హుషారు

- చల్లబడ్డ వాతావరణం - పొలం పనులకు సిద్ధమవుతున్న రైతాంగం

నారాయణపేట/ఊట్కూర్, మే 17 : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురువడంతో అన్నదాతలో హుషారు నెలకొంది. వేసవి దుక్కి దున్నుల్లో భాగంగా పొలాలను చదును చేస్తూ కానవచ్చారు. ట్రాక్టర్లు, గునుకల ద్వారా వ్యవసాయ పొలాలను దుక్కి దున్ని చదును చేసే పనుల్లో అన్నదాతలు దృష్టిని కేంద్రీకరించారు. పొలాలను చదును చేయడం వల్ల వచ్చే వర్షాలతో భూమిలో నీరు మరింత ఇంకే అవకాశం ఉండటంతో రైతులు వేసవి దుక్కి దున్నులో నిమగ్నమయ్యారు. ఊట్కూర్ మండలంలోని మల్లెపల్లి, చిన్నపొర్ల, ఎడవెల్లి గ్రామాల్లోని పొలాల్లో కూడా వర్షపు నీరు నిలిచి పోయింది. భూమి బాగా తడవటంతో రైతులు పొలం చదును చేసే పనులకు సిద్ధమయ్యారు. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న జనాలకు ఒక్కసారిగా గురువారం రాత్రి కురిసిన వానతో వాతావరణం చల్లబడడంతో పాటు, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది.



ట్రాక్టర్ ద్వారా పొలాలను దుక్కి దున్నుతున్న రైతు

తొలకరితో పులకరించిన నేలతల్లి

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- మరికొన్ని చినుకులు పడినట్లయితే సాగుకోసం అన్నదాతల ఉత్సాహం
- ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎన్నో ఆశలతో ముందుకు సాగనున్న అన్నదాతలు
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా గతేడాది వర్షాకాలంలో 4లక్షల 41వేల 247ఎకరాలల్లో పంటలు సాగు



తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామంలో తొలకరి చినుకులు పడడంతో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

తాడూరు, మే 17 : గత ఏడు నెలలుగా ముఖం చాటేసిన వరుణదేవుడు వర్షాకాల ఆరంభ సమయాన్ని పురస్కరించుకుని తొలకరితో నేలతల్లిని పులకరింపజేసింది. వానాకాలం పంటకు సంబంధించి ఖరీఫ్ సాగు కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్న వేళ గత రెండు రోజులుగా జిల్లాలో చిరుజల్లులు కురుస్తుండడంతో అన్నదాతలు పొలాలను సిద్ధం చేసుకుంటూ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత 2022 సంవత్సరం వర్షాకాలంలో అత్యధిక వర్షపాతం నమోదై అన్నదాతలు సాగు చేసిన 4లక్షల 93వేల 202ఎకరాల పంటలన్నీ అతివృష్టితో వర్షార్పణం అయిన సంగతి తెలిసిందే. 2023 వర్షాకాలంలో అన్నదాతలు సాగు చేసిన 4లక్షల 41వేల 247ఎకరాల పంటలు తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన పంటలన్నీ ఎండుముఖం పట్టి అంతంతమాత్రంగానే దిగుబడులు రావడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

ప్రస్తుతం 2024 పంటలకు సంబంధించి ప్రస్తుత వాతావరణ సూచనల ప్రకారం ఎలిమినో ప్రభావం ఉన్నప్పటికీ వర్షాలు సానుకూలంగా ఉంటాయన్న విషయంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకుంటున్న పంటలు పండి చేతికొచ్చేంత వరకు నమ్మకం ఉండదంటూ అన్నదాతలు ఆందోళనలు చెందుతున్నారు. ఏదేమైనా ప్రస్తుతం పడుతున్న తొలకరి చినుకులతో తమ పొలాల్లో కట్టె ఎగరడం, దున్నుకోవడం, ఎరువులు పొలాలకు తరలించడం వంటి కార్యకలాపాల్లో నిమగ్నులై ఉన్నారు.

జిల్లాలో గత రెండేళ్ల సాగు వివరాలిలా..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న 20మండలాల పరిధిలో 2022, 2023 సంవత్సరాల వానకాలం పంటలుగా ఏఏ మండలంలో ఎంత మేర సాగు చేశారన్న వివరాలు ఇలా ఉన్నాయి. లక్షా 62వేల 869 1లక్ష 50వేల 380 ఎకరాల్లో అన్నదాతలు పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా పత్తిపంట 2022లో 3లక్షల 30వేల 600ఎకరాల్లో పంట సాగు చేయగా, 2023లో 2లక్షల 35వేల 960ఎకరాలల్లో మాత్రమే సాగు చేశారు. వరి పంట 2022లో జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష 23వేల 76ఎకరాలు సాగు చేయగా, 2023 వానకాలంలో ఒక లక్ష 48వేల 513ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న పంట 2022లో జిల్లా వ్యాప్తంగా 31వేల 989ఎకరాల్లో సాగు చేయగా, 2023లో 48వేల 662ఎకరాల్లో పంటను సాగు చేశారు. మిగిలిన కంది, జొన్న, పెసర్లు, సజ్జలు, పొద్దుతిరుగుడు లాంటి పంటలన్నీ అంతంతమాత్రంగానే జిల్లాలో సాగవుతున్నాయి.



ఇటీవల చిరుజల్లులు కువడంతో విత్తనాలు వేసుకునేందుకు కోసం పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న అన్నదాత

రైతులకు చేదోడువాదోడుగా ఉంటాం.



ప్రస్తుతం మరికొద్ది రోజుల్లో వస్తున్న వర్షాకాలానికి సంబంధించి అన్నదాతలు చేసుకునే వ్యవసాయ సాగు కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తాం. వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడంతో పాటు పంట రుణాలు సకాలంలో అందించి వారికి తోడ్పాటునందించనున్నాం. కావున రైతులు సాగులో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా సజావుగా తమ వ్యవసాయ పనులు పరిస్థితుల కనుగుణంగా చేసుకోవాలి.

- వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్

గిరిజన కళాశాలల్లో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 17: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాలల ప్రాంతీయ సమన్వయ అధికారి నాగార్జున రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను పలు గిరిజన బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ గ్రూపులో 58, బైపీసీ 62, సీఈసీ 40, హెచ్ఈసీ 40, ఏఅండ్‌టీ 14 సీట్లు మిగిలినట్లు పేర్కొన్నారు. గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ 76, బైపీసీ 40, సీఈసీ 88, ఎంఈసీ 35 ఖాళీలు మిగిలినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని.. మహబూబ్ నగర్, జడ్చర్ల, అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తి, కేటీదొడ్డి, గద్వాల, కొండాపూర్, మన్ననూరు, పెద్దమందడి గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 23న బాలురకు, 25న బాలికలకు ఉదయం 10 గంటలకు మహబూబ్ నగర్ బాలికల గిరిజన జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి, మే 17 : మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో శుక్ర వారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య(45) ఆటో నడుపుతూ జీవనం సాగేంచేవాడు. ఓ మహిళ తన బంగారు గొలుసు వెంకటయ్య ఆటోలోనే పోయిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో నాగర్‌కర్నూల్ పోలీసులు వెంకటయ్యను ఈ నెల 15న పిలిచి విచారించారు. పోలీసులు శుక్రవారం మళ్లీ రమ్మని చెప్పడంతో అతను భయపడి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కూతురు ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐని సంప్రదించగా బంగారం పోగొట్టుకున్న మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు పిలిచి విచారించారని తెలిపారు. బాధితుల నుంచి ఇంత వరకు ఫిర్యాదు రాలేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్ మే 17 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామానికి ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవరపల్లిలో ఇంట్లో చోరీ

ఆత్మకూరు, మే17: వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం దేవరపల్లి గ్రామంలో వెంకటన్న అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించామని ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటన్న బంధువుల ఇంట్లో శుభకార్యం ఉందని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూసే వరకే ఇల్లు తాళం పగలగొట్టి ఉంది. ఇంటో పరిశీలించగా బీరువాలో ఉన్న 60వేల నగదు, తులం బంగారం, 25 తులాల వెండి దోచుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అటకెక్కిన బస్టాండ్ ఆధునికీకరణ

- అభివృద్ధి కోసం రూ.41 లక్షలు మంజూరు
- ఐదేళ్లయినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని వైనం



మద్దూర్ ఆర్టీసీ బస్టాండ్

మద్దూర్, మే 17 : మద్దూర్ బస్టాండ్ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. ఆధునికీకరణ కోసం 2018లో అప్పటి ప్రభుత్వం ఎంపీ ల్యాడ్స్, టీఆర్‌టీసీ నిధుల కింద బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణం, ప్రహరీ, తాగునీటి సౌకర్యం తదితర పనులు చేపట్టేందుకు రూ.41 లక్షలు మంజూరు చేసింది. ఈ క్రమంలో 25 సెప్టెంబరు 2018న అప్పటి ప్రభుత్వ మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డిలు శంకుస్థాపన కూడా చేశారు. అయితే అభివృద్ధి పనులు అప్పుడు, ఇప్పుడు అంటూ అధికారులు జాప్యం చేస్తూ కాలం వెళ్లదీశారు. మంజూరైన నిధులతో పనులు చేపట్టాలని మండల వాసులు కోరినా ఫలితం లేకుండా పోయింది. తాత్కాలిక పనులు మాత్రమే చేపట్టడం తప్ప మంజూరైన నిధులకు సంబంధించిన పనులు మాత్రం చేపట్టకపోవడంతో బస్టాండ్ అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో బస్టాండ్ పరిసరం సీసీకి నోచుకోక గుంతలు ఏర్పడడమే కాకుండా బస్సుల రాకపోకల సమయంలో ఉవ్వెత్తున దుమ్ము, ధూళి ఎగిసిపడి ఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంత వాసులు, ప్రయాణికులు పేర్కొన్నారు. బస్టాండ్ ఆధునికీకరణపై కొత్త ప్రభుత్వమైనా దృష్టి సారించాలని మండల వాసులు కోరుతున్నారు.



సీసీకి నోచుకోని బస్టాండ్ ఆవరణ

బస్టాండ్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టాలి



మద్దూర్ బస్టాండ్ నుంచి నిత్యం 60కి పైగా బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. వేల సంఖ్యలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యంతో ఆధునికీకరణ పనులు నోచుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా బస్టాండ్ ఆవరణతో పాటు, పరిసర ప్రాంతంలో సీసీ నిర్మాణంతో పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అవుటి సురేందర్, మద్దూర్

లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం

- ఆర్టీసీ మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవి


సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, మే 17 : ఆర్టీసీ సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. మే 14న గ్రాండ్ ఎలక్షన్ ఛాలెంజ్‌లో అత్యధిక ఆదాయం సాధించినందుకు ఆర్టీసీ సిబ్బందికి శుక్రవారం మహబూబ్‌నగర్ డిపోలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 'లక్షే లక్ష్యం' లక్ష్యాన్ని సాధించడంపై వీసీ, ఎండీ శుభాకాంక్షల సందేశాన్ని తెలియజేశారు. మున్ముందు కూడా ఇలాగే కొనసాగించాలని ఆర్ఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ లక్ష్మీధర్మ, ఆర్ఎంఎం శ్యామల సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన కృష్ణ తేజ్


కృష్ణ తేజ్‌ను అభినందిస్తున్న కరాటే చీఫ్ మాస్టర్ సామ్యూల్

వంగూరు మే 17: కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం నిజంబాద గ్రామానికి చెందిన కస్తూరి రవి, జ్యోతిల కుమారుడు కృష్ణ తేజ్ సత్తా చాటాడు. మలేషియాలో ఈసోసిటీలోని పెరక్ అరెనా మైదానంలో 20వ అంతర్జాతీయ ఒకినావా గోజుర్యు ఈసోసిటీ కరాటే ఒపెన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించారు. పోటీల్లో 16సంవత్సరాల లోపు 50కేజీల విభాగంలో కృష్ణతేజ్ బంగారు, కటాలో కాంస్య ప తాకాన్ని సాధించినట్లు షోభుకై అకాడమీ కరాటే చీఫ్ మాస్టర్ సామ్యూల్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థి కృష్ణతేజ్ హైదరాబాద్ కర్మన్‌ఘట్‌లోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా కృష్ణతేజ్‌ను ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు అభినందించారు.

రాయబరేలి ప్రచారంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి


రాయబరేలిలో జరిగిన ఎన్నికల ప్రచారం పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, జిల్లా ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్, మే 17 (ఆంధ్రజ్యోతి)/వనపర్తి టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో టీపీ సీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో పాటు పలువురు నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, గద్వాలకు చెందిన సరిత, తిరుపతయ్యలు రాయబరేలిలో ఇండియా కూటమికి అనుకూలంగా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ బృందం వెంట నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎనుగొండ మధుసూదన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చెరువులో చేపలు మృత్యువాత


మృత్యువాత పడి నీటిలో తేలుతున్న చేపలు

వనపర్తి రూరల్, మే17: వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల గ్రామంలో చింతలమ్మ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం మత్స్యకారులు చేపలు పట్టేందుకు చెరువు దగ్గరికి వెళ్లగా చేపలు మృత్యువాత పడి నీటి లో తేలాడుతున్నాయి. మృ త్యువాత పడ్డ చేపలను టె స్టుల కోసం ఫిషరీస్ క్లినిక్‌కు పంపగా డ్రైనేజీ వాటర్ కలవడం ద్వారా అ మ్మోనియం శాతం పెరిగి చేపలు మృత్యువాత పడ్డాయని ఫిషరీస్ వైద్యులు నిర్ధారించినట్లు మత్స్యకారులు అన్వేష్, శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో పాల్గొనేలా వినియోగదారుల ఫోరం తీర్పు

మహబూబ్‌నగర్ టౌన్, మే 17 : తిరుమల వేంకటేశ్వర స్వామి సేవ కోసం ఏడు కొండల మెట్లు ఎక్కినా కనికరించని స్వామి, చివరకు న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కాల్సివచ్చింది ఒక భక్తురాలు. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత కోర్టు స్వామి వారి సేవలో పాల్గొనే అవకాశం వినియోగదారుల ఫోరం కల్పించింది. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శెట్టి చంద్రశేఖర్ ఆయన సతీమణి సుమిత్ర శెట్టి దంపతులు తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మేల్ చాట్ వస్త్రసేవలో పాల్గొనడానికి 2007 ఆగస్టు 21న రూ. 12,250 డీడీ తీసి లేఖను జత చేసి తిరుమలకు పంపారు. సంవత్సరాలు గడుస్తున్నా స్వామి వారి సేవలో పాల్గొనే తేదీ ఖరారు కాలేదు. టీటీడీ వారికి అనేక లేఖలను కూడా రాశారు. ఆ దంపతులకు చివరకు 2021 సెప్టెంబరు 10న సేవలో పాల్గొనే స్లాట్ బుక్ అయ్యింది. కానీ, కరోనా కారణంగా ఆ సేవను రద్దు చేశామని దాని స్థానంలో బ్రేక్ దర్శనానికి అవకాశం కల్పిస్తామని టీటీడీ వారు తెలిపారు. ఆ దంపతులు అంగీకరించకుండా మేల్ చాట్ వస్త్ర సేవలోనే పాల్గొంటామని తెలుపగా అందుకు టీటీడీ వారు అంగీకరించలేదు. న్యాయం కోసం ఆ భక్తురాలు సుమిత్ర శెట్టి స్థానిక జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించగా 45 రోజుల గడువులోగా మేల్ చాట్ వస్త్రసేవలో పాల్గొనే అవకాశం కల్పించాలని, లేని పక్షంలో రూ. 10లక్షల జరిమానా చెల్లిస్తూ తిరిగి అదే సేవాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఈ నెల 8న తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ దంపతులు టీటీడీ వారి నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

పర్యాటక అభివృద్ధికి నోచుకోని చంద్రఘడ్ కోట


- ప్రాచీన కట్టడంపై దృష్టి సారించని పాలకులు
- 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కోట
- ఎమ్మెల్యే హామీతో చిగురిస్తున్న ఆశలు



చంద్రఘడ్ కోటపై నిర్మించిన రామలింగేశ్వర ఆలయం

అమరచింత, మే 17: జూరాల ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో అత్యంత పురాతన కట్టడాల్లో చంద్రఘడ్ కోట ఒకటి. ఆనాటి నుంచి పాలకులు మారుతున్న పర్యాటక అభివృద్ధికి ఈ కోట నోచుకోవడం లేదు. రాష్ట్రంలోనే ప్రాచీన కట్టడాల్లో అరుదుగా కనిపించే రాతి కట్టడం ఆనాటి రాజు వంశస్థులను గుర్తు చేస్తుంది. జూరాల ప్రాజెక్టుకు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నా చంద్రఘడ్ కోటను చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పర్యాటక మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ కోటను సందర్శించి పర్యాటక అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. దినదినం కోట శిథిలావస్థకు చేరుతోంది. ప్రస్తుత కాంగ్రెస్ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పర్యాటక అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడంతో ఈ ప్రాంత పర్యాటకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

18వ శతాబ్దం నాటి కోట నేపథ్యం

అమరచింత మండలం చంద్రఘడ్ గ్రామంలో ఉన్న ఈ కోటను 18వ శతాబ్దంలో ఆనాటి మరాఠీ రాజులు బాజీరావు పీస్వా ఆత్మకూరు సంస్థానాన్ని సందర్శించి పన్ను వసూలు కోసం చంద్రసేనుడుని ఈ ప్రాంతానికి నియమించాడు. దీంతో చంద్రసేనుడు ధర్మాపూర్ గ్రామ శివారులో ఉత్తర దశ ఎత్తైన కొండను ఎంచుకుని అక్కడ రాతికోట నిర్మించుకున్నాడు. ఈ కోట నుంచి ఈ ప్రాంతంలో ఉన్న పలు సంస్థానాధీశుల నుంచి పన్నులు వసూలు చేసి చంద్రసేనుడు మరాఠ రాజులైన బాజీరావు పీస్వాకు పంపించేవాడు. చంద్రసేనుడు నిర్మించిన కోట కాలక్రమమైన చంద్రఘడ్ కోటగా పిలవబడుతూ వస్తుంది. కోట కింది భాగం గ్రామం ఏర్పడి చంద్రఘడ్ గ్రామంగా మారి పోయింది.


కోటపై నీటి కొలనులు


శిథిలావస్థకు చేరుతున్న రాతి కోట


చంద్రగడ్ కోట

కోటలో ప్రాచీన ఆలయ నిర్మాణం

చంద్రఘడ్ కోటపైన ప్రాచీన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సైతం నిర్మించాడు. ఆలయంతో పాటు కోట మధ్యలో తాగునీటి ఇబ్బంది కలగకుండా ఎనిమిది చిన్న చిన్న కొలనులు ఏర్పాటు చేశాడు. ఆ కాలంలో ఎత్తైన కొండపై కోట నిర్మించి కొలనులో ఏడాది పాటు నీరు ఉండడం ఓ విశేషం. ఆనాడు నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతీ ఏటా శివరాత్రి సమయంలో ఉత్సవాలు జాతర జరపడం ఆనవాయితీగా వస్తుంది. శత్రు సైన్యం దండెత్తడానికి వస్తే ఈ కోట నుంచి పది కిలోమీటర్ల దూరంలో పసిగట్టే విధంగా కోట గోడలపై భారీ రంధ్రాలను ఏర్పాటు చేశాడు. కోట చుట్టు కందకాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక ఫిరంగులను అమర్చారు.

ఎమ్మెల్యే హామీతో చిగురిస్తున్న ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తాను ఎమ్మెల్యే గెలిచిన వెంటనే చంద్రఘడ్ కోటను పర్యాటక కేంద్రంగా మార్చడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. అలాగే జూరాల ప్రాజెక్టు, సంగం బండను పర్యాటక కేంద్రంగా మారుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరి గెలుపొందడంతో ఇచ్చిన హామీ మేరకు చంద్రకోటను పర్యాటక కేంద్రంగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక అభివృద్ధి చేసి తీరుతా..



ఇచ్చిన హామీ మేరకు చంద్రగడ్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి తీరుతా. మక్తల్ నియోజకవర్గంలో జూరాల ప్రాజెక్టు, సంగంబండ, చంద్రఘడ్ కోటలను పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి ఎన్నికల కోడ్ అనంతరం చర్యలు తీసుకుంటా. చంద్రఘడ్ కోట గురించి పురావస్తు శాఖకు లేఖ రాస్తా.

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి , మక్తల్

పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది



చంద్రఘడ్ కోటను సందర్శించే పర్యాటకుల సంఖ్య దినదినం పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు కేవలం మూడు కి.మీ. దూరంలో ఉన్న చంద్రఘడ్ కోటకు వస్తున్నారు. ప్రాచీన రాతి కట్టడంతో కోట నిర్మించడమే కాక కోటపైన రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మించడం మరో ప్రత్యేకం. పెరుగుతున్న పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించాలి.

- నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్, చంద్రఘడ్

పర్యాటక కేంద్రంగా మార్చాలి



అమరచింత మండలంలో ఉన్న చంద్రఘడ్ కోటను పాలక ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కోటకు దగ్గరలోనే జూరాల ప్రాజెక్టు ఉండడంతో పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఈ కోటను పర్యాటక కేంద్రంగా మార్చాలి.

- హనుమంత్, ఎంపీటీసీ సభ్యుడు, నందిమల్ల గ్రామం

ఆర్ఎంపీ క్లినిక్‌లపై దాడులు

- పరిమితికిమించి వైద్యం చేసిన క్లినిక్‌ల సీజ్



ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే 17: ఆర్ఎంపీ క్లినిక్‌లపై శుక్రవారం జిల్లా వైద్యాధికారులు దాడులు నిర్వహించారు. ఈనెల 16న ఆర్ఎంపీలపై నియంత్రణ ఏది? అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. దాంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం భూత్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ తిరుపతి రావు ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భూత్పూర్‌లోని అమ్మ క్లినిక్‌లో పరిమితికి మించి వైద్యం అందిస్తూ నాలుగు పడకలు నిర్వహించడంతో పాటు సెలైన్ బాటిళ్లు రోగికి ఎక్కించడం గుర్తించారు. దీంతో ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా మరో రెండు క్లినిక్‌లలో పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోవడం వలన వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స అందించాలన్నారు. తర్వాత వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలన్నారు. అయితే కొంతమంది డాక్టర్‌లాగా ఊహించుకొని యాంటిబయోటిక్స్ ఇస్తున్నారని, సెలైన్లు పెడుతున్నారని, పేరుకు ముందు డాక్టర్ అని రాసుకుంటున్నారని, పడకలు సైతం పెట్టుకొని ఆసుపత్రిని ఏర్పాటు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్థాయికి మించి వైద్యం అందించే ఆర్ఎంపీ వైద్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ తనిఖీల్లో సీహెచ్‌వో ఆయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్, పోలీస్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

పర్యావరణానికి విఘాతం కలగకుండా పరిశీలిస్తున్నాం

- మైనింగ్ ఆర్ఐ నాగచైతన్య


మైలారం గ్రామస్థులతో మాట్లాడుతున్న మైనింగ్ ఆర్ఐ నాగచైతన్య

బల్మూరు, మే 17 : మైనింగ్ చేపడితే పర్యావరణం ఏవిధంగా ఉంటుందో వాటిని చూసేందుకు మైలారం గుట్టను పరిశీలించామని మైనింగ్ ఆర్ఐ నాగచైతన్య అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టను మైనింగ్ ఆర్ఐతో పాటు సర్వేయర్ సుజాత, గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్టలో జాతీయ పక్షులతో పాటు ఇతర జంతువులు కూడా ఉన్నట్లు ఉన్నాయని, గ్రామం కూడా గుట్టకు ఆనుకుని ఉండడం వల్ల మూగజీవాలను గ్రామస్థులు గుట్టపై మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గుట్టకు ఆనుకుని పురాతన శివాలయంతోపాటు అమ్మవారి ఆలయాలు కూడా ఉన్నాయని, వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలన చేశామన్నారు. గ్రామస్థులతో మాట్లాడితే మైనింగ్ ఇక్కడ వద్దు తెలిపారని, మైనింగ్ చేస్తే తమకు ఆత్మహత్యలు తప్పవని కొందరు తెలిపారన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ముర్తుజా (మున్న)

ఊర్కొండ, మే 17 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం ఊర్కొండ పేట గ్రామానికి చెందిన ముర్తుజా (మున్న) (60) వారం రోజులు క్రితం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మం డల కేంద్రంలో ఓ శుభకార్యంలో పాల్గొని ఇంటికి వెళ్తుండగా రేవల్లి గేటు వద్ద ధ్యానం కుప్పకు అడ్డు పెట్టిన రాళ్లకు బైకు ఢీ కొని తీవ్రంగా గాయపడ్డారు. దాంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామని ఎస్ఐ పేర్కొన్నారు.

స్కూటీ డిక్కీలో ఉంచిన ఎనిమిది సెల్‌ఫోన్లు చోరీ

గద్వాల క్రైం, మే 17: పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు స్కూటీ డిక్కీలో ఉంచిన సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన గద్వాల పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితుడు శివకుమార్ వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఎనిమిది మంది విద్యార్థులు వెంట తెచ్చుకున్న సెల్‌ఫోన్లను మిత్రుడి స్కూటీ డిక్కీలో ఉంచి పరీక్ష రాసేందుకు వెళ్లారు. తీరా పరీక్ష రాసి వచ్చి చూడగా అప్పటికే డిక్కీ విరగ్గొట్టి అందులో ఉన్న ఎనిమిది సెల్‌ఫోన్లను ఎవరో ఎత్తికెళ్లారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

భూపంచాయితీ కేసులో ఆరుగురికి జైలు

- ఒక్కొక్కరికి రూ. 2వేల చొప్పున జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం/కల్వకుర్తి, మే 17 : భూపంచాయితీ కేసులో ఆరుగురికి రెండు సంవత్సరాల జైలు, ఒక్కొక్కరికి రూ. రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ కల్వకుర్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి, అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి శ్రీదేవి తీర్పు ఇచ్చినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. కల్వకుర్తి మండలం యంగంపల్లి గ్రామంలో 2020 లో భూతగాదాలో చెరుకు వంశీకృష్ణను అదే గ్రామానికి చెందిన సి.పర్వత్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుల్తాన్, మాధవరెడ్డి, ఎద్మ సందీప్‌లు తీవ్రంగా కొట్టి గాయపరిచారు. దీంతో వంశీకృష్ణ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బాధితుడి తల్లి లక్ష్మమ్మ కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసును నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం శుక్రవారం న్యాయాధికారి శ్రీదేవి నిందితులు సి.పర్వత్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుల్తాన్, మాధవరెడ్డి, సందీప్‌లకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రెండువేల జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన కల్వకుర్తి సీఐ, ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

మాగనూరులో 20 గొర్రెల అపహరణ

మాగనూరు, మే17: నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రానికి చెందిన కురువ బీరప్పకు చెందిన 20 గొర్రెలు గురువారం రాత్రి అపహరించుకపోయారు. గ్రామస్థులు, కురువ బీరప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి మాగనూరు శివారులోని గోకుర్ సాబ్ దర్గా పక్కన పొలంలో గొర్రెల మందను నిలిపి చుట్టూ వల వేశారు. అర్ధరాత్రి వర్షం రావడంతో గొర్రెల మంద వద్ద పండుకున్న గొర్రెల కాపరి లేచి చూడగా వల ఒక పక్క తీసి ఉండడంతో అనుమానం వచ్చి శుక్రవారం ఉదయం పరిశీలించగా 20 గొర్రెలు తక్కువ వచ్చాయి. దాంతో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. విషయంపై మాగనూరు పోలీసులను అడగగా తమకు ఏలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎందుకింత నిర్లక్ష్యం?


విద్యుత్ స్తంభం వద్ద నేలపై పడిఉన్న విద్యుత్‌వైర్లు

కల్వకుర్తి, మే 17 : కల్వకుర్తి-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. వీధి లైన్ల కోసం ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలకు బల్బులు వెలిగించడానికి విద్యుత్ తీగలను భూమిలో నుంచి తీసి కనెక్షన్లు ఇచ్చారు. ఈ కనెక్షన్లు దెబ్బతిని వైర్లు తేలిన పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఓ నిండు ప్రాణం బలైంది. పట్టణానికి చెందిన రాము(22) గురువారం రాత్రి నాగర్‌కర్నూల్ రోడ్డులోని వైన్‌షాపు వద్దకు వచ్చి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత సంఘటన విధితమే. రోడ్డు పక్కన వైన్‌షాపు నిర్వాహకులు సైతం సరైన లైటిం గ్ ఏర్పాటు చేసుకోకపోవడం కూడా విమర్శలకు తావి స్తోంది. ప్రధాన రహదారి పక్కన ఉన్న పలు స్తంభాలకు ఏర్పాటు చేసిన కనెక్షన్లు అంతంతమాత్రంగానే వైరింగ్ ఉండి ప్రమాదభరితంగా ఉన్నాయి. సంబంధిత అధి కారులు, సిబ్బంది పూర్తి నిర్లక్ష్యం వల్లే రాము మృత్యువాత పడ్డాడని పట్టణంలోని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సం బంధిత మునిసిపల్ అధికారులు స్పందించి నాగర్‌కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్‌స్తంభాల కోసం విద్యుదీకరణ కోసం వేసిన వైర్లను ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగేళ్లయినా పూర్తికాని పల్లె దవాఖాన భవనం


అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

రేవల్లి,మే17: వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో నాలుగు సంవత్సరాలుగా పల్లె దవాఖాన భవనం లేక సంఘం భవనాలను అద్దెకు తీసుకుని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మూడు రూములలోకి సామగ్రిని మార్చామని గ్రామ సర్పంచ్ ఉన్నప్పుడు అద్దె చెల్లించే వారని ఇప్పుడు గ్రామస్థులు ఎవరు అద్దె చెల్లించడం లేదని సిబ్బంది తెలిపారు. రూ. 20 లక్షలలో పల్లె దవాఖాన భవనం మంజూరైనప్పటికీ సగం పూర్తి చేసి బిల్లు రావడం లేదని కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. ఈ విషయంపై వివరణ కోసం కాంట్రాక్టర్ బొందయ్యకు ఫోన్ చేయగా స్పందించడం లేదు. భవనం లేకపోవడంతో చిన్న పిల్లలకు టీకాలు వేసుకోవడానికి వస్తున్న తల్లులకు, గర్భిణులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ అధికారులు , ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి త్వరగా భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు, సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయంపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంజలిని అడగగా ప్రస్తుతం ఏర్పాటు చేసిన సంఘం అద్దె భవనంలో కనీస వసతులు లేవని, అద్దె కూడా ఎవరు చెల్లించడం లేదన్నారు. గ్రామానికి ఉపయోగపడే భవనాన్ని పూర్తి చేయలేకపోయినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. భవనం పూర్తయితే తమకు, వైద్యం కోసం వచ్చేవారికి ఇబ్బందులు ఉండవని అన్నారు.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి

▸ ఏడీఏ సక్రియా నాయక్ ▸ ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ సక్రియా నాయక్

వడ్డేపల్లి, మే 17 : లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అలంపూర్ డివిజన్ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచించారు. లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దని చెప్పారు. మండల కేంద్రమైన శాంతినగర్‌లో ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కోరమండల్, ప్రాథమిక సహకార సంఘం, శ్రీరామ ట్రేడర్స్ శ్రీనిధి ఎరువుల దుకాణాలతో పాటు కొంకల గ్రామంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పంటల సాగుకు అవసరమైన మిరప, పత్తి, కందులు, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరి రశీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో లూజు విత్తనాలను అమ్మేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రాధ, ఏఈవో ఉన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆలయాలు

▸ నేడు బ్రహ్మంగారి రథోత్సవం ▸ రేపు ఎద్దుల బల ప్రదర్శన



ప్రారంభానికి సిద్ధమైన బ్రహ్మంగారు, ఈశ్వరమ్మ ఆలయాలు

వడ్డేపల్లి, మే 17 : మునిసిపాలిటీ పరిధిలోని పైపాడులో నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరమ్మ ఆలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా ఈ నెల 18న సాయంత్రం బ్రహ్మంగారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహోత్సవాల సందర్భంగా గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన జిల్లాస్థాయి కాడెద్దుల బల ప్రదర్శన, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అదే రోజు పరుగుపందెం, స్లో బైక్, ఇసుక సంచి ఎత్తు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ.30,116, రెండవ బహుమతిగా రూ.20,116, మూడవ బహుమతిగా రూ.10,116 ఇవ్వనున్నట్లు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, మే 17 : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ అభివృద్ధి అధికారి శ్వేతా ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 57 నాన్ రెసిడెన్షియల్, 59 రెసిడెన్షియల్ సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒకటవ తరగతిలో డే స్కాలర్స్ ప్రవేశం కోసం 2018 జూన్ ఒకటవ తేదీ నుంచి 2019 మే 30వ తేదీలోగా పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశం కోసం నాలుగవ తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షల రూపాయలు ఉండాలని తెలిపారు. కులం, ఆదాయం, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ల కాపీలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. బాలుర, బాలికల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధించిన ఫారాలు ఈ నెల 18 నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో ఉచితంగా పొందొచ్చని పేర్కొన్నారు. వచ్చేనెల ఏడవ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం...

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ అభ్యర్థులకు అందించే నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మాస్టర్స్, పీహెచ్‌డీ, రీసెర్చ్ ప్రోగాం కోసం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనం అందుతుందని తెలిపారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు

▸ మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా తవ్వకాలు



పాతపాలెంలో ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కేటీదొడ్డి, మే 17 : మండలంలోని గ్రామాల్లో అనుమతి లేకుండా ఎర్ర మట్టి తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలంలోని కేటీదొడ్డి, కొండాపురం, పాతపాలెం, నందిన్నె గ్రామాల్లో పట్టా భూములతో పాటు, ప్రభుత్వ భూముల్లోనూ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి సొంత పట్టాభూమిలో నుంచి ఎర్ర మట్టిని తరలించాలన్నా మైనింగ్, రెవెన్యూ అధికారులతో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ గ్రామాల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఉన్నవారు మట్టి, ఇసుక దందాతో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఇసుక, మట్టిని తరలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

కొలతల ప్రకారం పనులు చేయించాలి

▸ ఏపీవో విజయ్ శంకర్

మానవపాడు, మే 17 : ఉపాధి హామీ పనుల్లో కూలీలతో కొలతలు ప్రకారం పనులు చేయించాలని ఏపీవో విజయ్ శంకర్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ప్రతీ రోజు పర్యవేక్షించాలని చెప్పారు. నిబంధనల ప్రకారం పనులు చేయించి తగిన కూలి వచ్చేలా చూడాలన్నారు. ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఎంబీలు రికార్డు చేయాలని సూచించారు. పనులు చేసిన కూలీల ఖాతాల్లో ప్రతీ వారం డబ్బు జమ చేయించాలని, మస్టర్లను ప్రతీ మేటీకి ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు.

రహదారి.. ఏదీ దారి?

▸ చెరువును తలపిస్తున్న ధరూరు - రాయచూరు రోడ్డు ▸ మరమ్మతుకు నోచుకోక అవస్థలు



ప్రాగటూరులో దేవాలయానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ధరూరు-రాయచూరు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో వాహనదారుల అవస్థలు

ధరూరు/ వడ్డేపల్లి/ ఉండవల్లి, మే 17 : ధరూరు - రాయచూరు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. గడచిన నాలుగు సంవత్సరాలుగా రహదారి విస్తరణతో పాటు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు, ఇతర ప్రాంతాలకు బస్సులు ఈ రోడ్డు మీదుగానే వెళ్తుంటాయి. అంతరాష్ట్ర రహదారి కావడంతో జూరాల ప్రాజెక్టుకు కూడా ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డంతా గుంతలమయం కావడంతో, వర్షాకాలంలో నాలుగు నుంచి ఐదు అడుగుల లోతు నీరు నిలిచి ఉంటోంది. దీంతో వాహనాల రాకపోకలు కష్టతరంగా మారాయి. సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేక పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, వర్షాకాలం మొదలయ్యేలోగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

అలాగే వడ్డేపల్లి మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు చెప్తున్నారు. రోడ్లు దెబ్బతినడంతో మండలంలోని కోవెలదిన్నె, పైపాడు, జూలకల్లు, తనగల తదితర గ్రామాలకు రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని వాపోతు న్నారు. కోవెలదిన్నెకు వెళ్లే రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని చెప్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉండవల్లి మండల పరిధిలోని గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. మండలంలోని భైరాపురం గ్రామంలోని కొన్ని కాలనీలో రోడ్లు నెర్రెలు బారాయి. చిన్న ఆముదాల పాడులో సీసీ రోడ్లు లేవు. తక్కశిలలో సీసీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రాగటూర్‌లో దేవాలయానికి వేళ్లే దారి అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను బాగు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోస్తరు వర్షానికే రోడ్లు జలమయం

గద్వాల టౌన్, మే 17 : జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచి చెరువుల్లాగా కనిపించాయి. అంబేడ్కర్ సర్కిల్ వద్ద అటు బీరెల్లి రోడ్డు, ఇటు ఆస్పత్రికి వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలువడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉండింది. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మునిసిపల్ అధికారులు స్పందించారు. ధరూరు మెట్టు సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అలాగే కొత్త, పాత హౌసింగ్ బోర్డు కాలనీలు, రాఘవేంద్రకాలనీ సమీపంలోని రోడ్డు, వేదనగర్, రాంనగర్, గంటవీధి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.



గద్వాల అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ధరూరు మెట్టు కల్వర్టు వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు

▸ కలెక్టర్ బీఎం సంతోష్ ▸ లత్తిపురం, బీరెల్లి కొనుగోలు కేంద్రాల పరిశీలన ▸ మిల్లర్లు ధాన్యాన్ని తిరస్కరించడంపై ఆగ్రహం



బీరెల్లి కొనుగోలు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల, మే 17 : నిబంధనల ప్రచారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మండల పరిధిలోని లత్తిపురం, బీరెల్లి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల పరిస్థితిని తెలుసుకున్నారు. టార్పాలిన్లు కప్పి ఉంచడంతో ధాన్యం తడవలేదు. కానీ రెండు రోజుల నుంచి కొనుగోలు చేసిన ధన్యాన్ని పంపించగా, తిరస్కరించినట్లు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. మిల్లర్ల అసోషియషన్ లీడరే ధాన్యాన్ని వాపసు పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడికి వచ్చి పరిశీలించుకోవాలని సూచించడంతో కంగుతిన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లుకు సూచించారు. వర్షాలు కురిసే సమయం కాబట్టి, రైతులకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో నర్సింగరావు, సివిల్ సప్లయ్ డీఎం విమల, ఎంపీడీవో ఉమాదేవి, ఏపీఎం పారిజాత ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన

గద్వాల న్యూటౌన్ : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా బడుల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఏఏపీ కమిటీల ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఏఏపీ కమిటీల ద్వారా ప్రభుత్వ పఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభానికి 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏఏపీ కమిటీల ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి ఏర్పాటు, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పూర్తి చేసిన పనులను నమోదు చేసి, సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, సకాలంలో రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. కస్టమ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరితగతిన డెలివరీ చేయిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామ్‌చందర్, డీఆర్‌డీవో నర్సింగరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

▸ అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ - ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

గద్వాల న్యూటౌన్, మే 17 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24 నుంచి వచ్చేనెల మూడవ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందుకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రతీ కేంద్రం వద్ద ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎంకి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో, 3,664 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులతో పాటు సిబ్బంది కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రామ్‌చందర్, డీఎస్పీ సత్యనారాయణ, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి హృదయరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప పాల్గొన్నారు.

బీపీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

▸ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ

▸ బస్తీ దవాఖానాలో 'వరల్డ్ హైపర్ టెన్షన్ డే'



గద్వాల బస్తీ దవాఖానాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శశికళ

గద్వాల న్యూటౌన్, మే 17 : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశ కార్యకర్తలు బీపీ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారని, 30 సంవత్సరాల వయసు దాటిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ సూచించారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బస్తీ దవాఖానా, రామ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే బీపీ మందులు వాడుతున్న వారందరూ ప్రతీ నెల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బీపీ ఉన్న వారు ప్రతీ రోజు వ్యాయామం, ధ్యానం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఎవరికైనా ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోతే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎన్‌సీడీ క్లినిక్‌లోని వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప, వైద్యులు స్రవంతి, రాజు, రాధిక, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.



క్యాతూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూనారాణి

వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి

అలంపూర్ : వైద్యుల సూచనలు, సలహాలు పాటించి అధిక రక్తపోటును తగ్గించుకోవచ్చని క్యాతూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రసూనారాణి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం క్యాతూరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీపీ సైలెంట్ కిల్లర్ అని, దీనిని సకాలంలో గుర్తించి తగిన చికిత్సతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే నియంత్రణలో ఉంచుకోవచ్చని చెప్పారు. మానసిక ఒత్తిడికి గురి కాకూడదని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, బీపీ మాత్రలను సక్రమంగా వాడాలని సూచించారు. రక్తపోటును నియంత్రించుకోలేక పోతే మూత్రపిండాలపై ఒత్తిడి పెరిగి అవి సరిగా పని చేయకపోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామస్వామి, లక్ష్మీకాంత్, బాలీశ్వరయ్య, హరిప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

20న ఔట్ సోర్సింగ్ దరఖాస్తుదారులకు లక్కీడిప్

గద్వాల న్యూ టౌన్ మే 17 : జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 20న లక్కీడిప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లక్కీ డిప్ ఉంటుందని పేర్కొన్నారు. డాట ఎంట్రీ ఆపరేటర్ 672, ఆఫీస్ సబార్డినేట్ 1,483, ల్యాబ్ అటెండర్ 201, థియేటర్ అసిస్టెంట్ 14 పోస్టులకు 2,370 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు లక్కీ డిప్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, మే 17 : అత్యవసర మరమ్మతుల కారణంగా ఈ నెల 18వ తేదీన ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో పాతబడిన విద్యుత్ స్తంభాలను మార్చడం, కొత్త ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడం, విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అందువల్ల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు, రాధాకృష్ణకాలనీ, బీరెల్లి చౌరస్తా, వేణుకాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి, రైల్వేస్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

▸ మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్

మానవపాడు, మే 17 : వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ తదితర ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

గద్వాల టౌన్, మే 17 : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఈ నెల 18వ తేదీ శనివారం తాగునీటి సరఫరా ఉండదని మిషన్ భగీరథ గద్వాల గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవిచంద్రకుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూరు మండలం రేవులపల్లి (జూరాల ప్రాజెక్టు) వద్ద నున్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ వద్ద నీటి శుద్ధి కర్మాగారాన్ని శుభ్రం చేస్తున్నందున నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆదివారం నుంచి తాగునీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

విరిగిన కరెంట్ స్తంభం

▸ పొంచి ఉన్న ప్రమాదం



ఔటర్ రింగ్ రోడ్డు పక్కన విరిగిన విద్యుత్ స్తంభం

గద్వాల అర్బన్, మే 17 : గద్వాల పట్టణ సమీపంలో అయిజ - రాయచూర్ ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన ఓ విద్యుత్ స్తంభం సగానికి విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ దారిలో వెళ్లే ప్రజలు, పాదాచారులు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు మూడు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని, వాటి ప్రభావంతో స్తంభం కూలే ప్రమాదముందని చెప్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అలంపూర్ ఆలయ భూముల పరిశీలన

అలంపూర్ చౌరస్తా, మే 17 : అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామివారి ఆలయాలకు సంబంధించిన భూములను ఈవో పురేందర్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. కర్నూలు పట్టణంలోని కల్లూరు శివారులో ఆలయానికి చెందిన వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో కొందరు యువకులు ఆడుకునేందుకు అనువుగా సీసీ బెడ్ నిర్మించారు. దీనిని పరిశీలించిన ఈవో స్థానికులతో మాట్లాడారు. ఆలయం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమి సరిహద్దులను పరిశీలించారు.